క్లుప్తంగా...

సంక్షేమ పథకాలు పేదలకు వరం



సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్‌

గోల్కొండ: సంక్షేమ పథకాలు పేదలకు వరమని ఎమ్మెల్యే కౌసర్‌ మోహియుద్దీన్‌ అన్నారు. సోమవారం టోలిచౌకీలోని తన కార్యాలయంలో కార్వాన్‌, గోల్కొండ, లంగర్‌హౌస్‌ డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కుల మతాలకతీతంగా అర్హులైన వారు వివిధ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్‌ రఫత్‌ హుస్సేన్‌, అలీముద్దీన్‌ తదితరులున్నారు.

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్‌ సేవాదళ్‌ ఇన్‌చార్జిగా అఫ్సర్‌



గోల్కొండ: తెలంగాణ ప్రదేశ్‌ కాంగ్రెస్‌ కమిటీ ఉపాధ్యక్షుడు అఫ్సర్‌ యూసుఫ్‌జాహీ రాష్ట్ర కాంగ్రెస్‌ సేవాదళ్‌ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పి.మహేష్‌కుమార్‌గౌడ్‌ చేతుల మీదుగా ఆయన సోమవారం ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన జీవితం కాంగ్రెస్‌ పార్టీకే అంకితం అన్నారు. యూత్‌ కాంగ్రెస్‌లో చురుకైన కార్యకర్తగా ఉంటూ అంచలంచలుగా ఎదిగానన్నారు. అదిష్టానం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించానన్నారు.

తుల్జాపూర్‌లో ముగిసిన తెలంగాణ బోనాలు



ఊరేగింపులో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు

చార్మినార్‌: తుల్జాపూర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన తెలంగాణ బోనాల ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. తుల్జాపూర్‌లో బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు డబీర్‌పురా పంచదుర్గ ఆలయానికి చెందిన భక్తులు గత నెల 28న తుల్జాపూర్‌కు చేరుకుని ఆదివారం ఊరేగింపు నిర్వహించారు. సోమవారం ఘటం పరిసమాప్తి సామూహిక ఊరేగింపుతో ఉత్సవాలు ముగిశాయని కమిటీ ప్రతినిధులు పి.ఆనంద్‌, లింగాల ప్రేమ్‌కుమార్‌, నక్కా మహేందర్‌ గౌడ్‌, పింజర్ల సత్యనారాయణ, ఘటం నాగేష్‌, పోతురాజ్‌ నర్సింగ్‌ తెలిపారు.

విజయవాడ కనక దుర్గ ఆలయ ఈఓకు ఆహ్వానం



గౌలిపురా: గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భారతమాత ఆలయం, కోట మైసమ్మ ఆలయంలో నిర్వహించే బోనాలకు హాజరుకావాలని కోరుతూ విజయవాడ కనక దుర్గ ఆలయం ఈఓ శ్రీను నాయక్‌ను కమిటీ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్‌ గంగపుత్ర ప్రతినిధుల బృందం కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కె.ఎస్‌.ఆనంద్‌ రావు, ముఖ్యసలహాదారులు కె.జ్ఞానేశ్వర్‌ ముదిరాజ్‌, ప్రధాన కార్యదర్శి అల్లి మధుసూదన్‌ గిరి, ఉపాధ్యక్షులు బి.వై.శ్రీకాంత్‌, కోశాధికారి బొడ్డు సాయిబాబా, యెంగిలి రాజు ఉన్నారు.

కార్మిక వ్యతిరేకి బీజేపీ



తహసీల్దార్‌కు సమ్మె నోటీస్‌ ఇస్తున్న నాయకులు

చాంద్రాయణగుట్ట: బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని సీఐటీయూ చాంద్రాయణగుట్ట జోన్‌ కార్యదర్శి ఎస్‌.కిషన్‌ అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించిన నోటీస్‌ను సోమవారం బండ్లగూడ మండల తహసీల్దార్‌ ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కిషన్‌ మాట్లాడుతూ..కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. సీఐటీయూ నాయకులు అన్వర్‌ భాష, గౌస్‌, వెంకట రామరాజు పాల్గొన్నారు.

తాగునీటి కటకట

- కార్వాన్‌లోని పలు బస్తీల్లో లో ప్రెషర్‌తో నీటి సరఫరా
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

జియాగూడ: లో ప్రెషర్‌ నీటి సరఫరాతో కార్వాన్‌లోని పలు బస్తీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 15 రోజుల నుంచి నీటి సరఫరా లో ప్రెషర్‌తో రావడంతో కనీస అవసరాలకు సరిపోవడం లేదన్నారు. దీంతో డబ్బులు పెట్టి నీటిని కొనుగోలు చేస్తున్నామని బస్తీల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నవోదయనగర్‌ తాగునీటి కార్యాలయం పరిధిలోకి వచ్చే కార్వాన్‌ ప్రాంతాల్లో లో ప్రెషర్‌తో వస్తున్నా నీటి సరఫరా కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సంపులోకి లో ప్రెషర్‌తో వస్తున్న తాగునీరు



మహిళలతో మాట్లాడుతున్న రాష్ట్ర బీజేవైఎం నాయకుడు పదాల అనంత కృష్ణ

ఈ బస్తీల్లోనే లో ప్రెషర్‌ సమస్య..

కార్వాన్‌లోని పంచ్‌భాయ్‌ అలవా, మార్కండేయనగర్‌ భవన్‌లేన్‌, శివాలయం వీధి, క్రాంతి భవన్‌ వెనుక భాగం, కమాన్‌, ఆంధ్రుని కార్వాన్‌ తదితర ప్రాంతాల్లో లో ప్రెషర్‌తో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి..



నవోదయనగర్‌లోని వాటర్‌వర్క్స్‌, సీవరేజీ బోర్డు జనరల్‌ మేనేజర్‌ శ్రీను నాయక్‌ను ఇటీవల కలిశాం. లో ప్రెషర్‌ సమస్యను మేనేజర్‌కు వినతిపత్రం అందజేశాం. కార్వాన్‌ ప్రాంతాల్లో ఇప్పటికే బోనాల వేడుకలు ప్రారంభమయ్యాయి. పండగ వేళల్లో నీటి ఇబ్బంది అవుతుండడం వల్ల స్థానిక బస్తీలవాసులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– పదాల అనంత కృష్ణ, శివ శంకర క్రాంతి సేవా సమితి అధ్యక్షుడు

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు..



15 రోజుల నుంచి తాగునీరు లో ప్రెషర్‌తో రావడం వల్ల సంపుల్లోకి దిగి పట్టుకోవాల్సి వస్తోంది. తాగునీటి సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. నీటి సరఫరా సమయాన్ని కూడా పాటించడం లేదు. దీంతో మహిళలు నీటి కోసం పడిగాపులు గాస్తున్నారు. కార్యాలయ సిబ్బంది సమస్య ప్రాంతాలను సందర్శించి వాటి పరిస్కారానికి కృషి చేయాలి. బోనాల పండుగను దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకోవాలి.

– నల్ల నర్సింగ్‌ యాదవ్‌ స్థానికుడు

విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

అఫ్జల్‌గంజ్‌: విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలని టేబుల్‌ టెన్నిస్‌ క్రీడాకారిణి నైనా జైస్వాల్‌ అన్నారు. రెండు రోజులుగా జైన్‌ స్పోర్ట్స్‌ లీగ్‌ ఆధ్వర్యంలో జరుగుతున్న జైన్‌ స్పోర్ట్స్‌ లీగ్‌ బ్యాడ్మింటన్‌ టోర్నమెంట్‌ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వివిధ విభాగాలలో గెలుపొందిన బాలబాలికల జట్లకు బహుమతులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..ఇటువంటి పోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని వారిలో దాగి ఉన్న ప్రతిభ వెలికి తీసేందుకు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్‌ లీగ్‌ ప్రతినిధులు హితేష్‌ జైన్‌ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నైనా జైస్వాల్‌ తదితరులు

బుజిలి మహంకాళి ఆలయ చైర్మన్‌గా చంద్రశేఖర్‌



లంగర్‌హౌస్‌: లంగర్‌హౌస్‌లోని బుజిలి మహంకాళి అమ్మవారి బోనాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ చైర్మన్‌ గడ్డి చంద్రశేఖర్‌ అన్నారు. సోమవారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనను చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌ మాట్లాడుతూ..మహంకాళి అమ్మవారి తరఫున జగదాంబిక మహంకాళి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్‌ పరమేశ్‌కుమార్‌, ఉదయ్‌కుమార్‌, కృష్ణయాదవ్‌ తదితరులున్నారు.

నేడు సామూహిక కుంకుమార్చన

యాకుత్‌పురా: హరిబౌలీ గజనన వ్యాయామశాల మాతేశ్వరీ పోచమ్మ, మహంకాళి ఆలయం ఆషాఢ మాసం 21వ వార్షిక బోనాల ఉత్సవాల సందర్భంగా మంగళవారం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నమని ఆలయ కమిటీ ప్రధాన ప్రతినిధి కేడాల దినేష్‌ తెలిపారు. 5 మంగళవారాల పాటు నిర్వహించే ఈ కుంకుమార్చన కార్యక్రమాన్ని మొదటి రోజు సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించనున్నామన్నారు.

యాదవులకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

అబిడ్స్‌: యాదవులకు కాంగ్రెస్‌ ప్రభుత్వం వెంటనే మంత్రివర్గంలో స్థానం కల్పించాలని భారతీయ యాదవ సేవా సమితి నగర అధ్యక్షుడు బి.రాజేష్‌ యాదవ్‌ పేర్కొన్నారు. యాదవ సత్యాగ్రహ దీక్ష రాష్ట్ర అధ్యక్షుడు కాటం నర్సింహాయాదవ్‌ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన యాదవుల దీక్షకు రాజేష్‌యాదవ్‌ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యాదవ కులస్తులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా రాజేష్‌ యాదవ్‌ మాట్లాడుతూ..యాదవులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గేష్‌ యాదవ్‌, లక్ష్మీకాంత్‌ యాదవ్‌, అరుణ్‌ యాదవ్‌ పాల్గొన్నారు.



యాదవుల దీక్షకు సంఘీభావం ప్రకటించిన రాజేష్‌యాదవ్‌

మానవాళి మనుగడకు వైద్యుల సేవలు మరువలేనివి



డాక్టర్‌ శైలజకు వైద్య రత్న అవార్డు అందజేసి సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్‌: మానవాళి మనుగడకు వైద్యుల సేవలు మరువలేనివని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌, ఎమ్మెల్సీ డాక్టర్‌ బండ ప్రకాష్‌ అన్నారు. భారతరత్న డాక్టర్‌ బీసీ రాయ్‌ జయంతిని పురస్కరించుకొని జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ సిటిజన్స్‌ కౌన్సిల్‌ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సీనియర్‌ మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ డి.శైలజకు వైద్యరత్న–2025 అవార్డును అందజేసి సత్కరించారు. అనంతరం బండ ప్రకాష్‌ మాట్లాడుతూ..బీసీ రాయ్‌ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని గ్రామీణ నిరుపేదలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రముఖ న్యాయవాది, టీసీసీ సెక్రెటరీ జనరల్‌ టి.ఎ.మురళీమోహన్‌ మాట్లాడుతూ..పగలు రాత్రి తేడా లేకుండా వైద్యులు చేస్తున్న సేవలు అమోఘమన్నారు. డాక్టర్‌ రంగస్వామి, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు పుస్తే శ్రీకాంత్‌, పవన్‌రెడ్డి, మంజుల సంస్థ కో ఆర్డినేటర్‌ జి.వేణుగోపాల్‌ ముదిరాజ్‌ పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన ప్రారంభం

చార్మినార్‌: సిటీ కళాశాల, గ్రంథాలయ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జరగనున్న పుస్తక ప్రదర్శన సోమవారం ప్రారంభమైంది. కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ విప్లవ దత్‌ శుక్ల ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల కోసం ప్రతి సంవత్సరం దాదాపు రూ.5 లక్షల విలువైన పుస్తకాలను గ్రంథాలయ శాస్త్ర విభాగంలో అందుబాటులో ఉంచుతున్నామన్నారు. విద్యార్థులు ఈ వారం రోజుల పాటు గ్రంథాలయంలోని ప్రతి విభాగంలో ఉన్న పుస్తకాలను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. డాక్టర్‌ రవికుమార్‌ చేగోని, డాక్టర్‌ కోయి కోటేశ్వరరావు, డాక్టర్‌ నీరజ, డాక్టర్‌ పర్వతాలు, డాక్టర్‌ శారద, డాక్టర్‌ మల్లికార్జున్‌, తభుసమ ఫాతిమా పాల్గొన్నారు.



నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

శాలిబండ: విద్యుత్‌ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈఈ తెలిపారు. తీగల్‌కుంట ఫీడర్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు. 11 కేవీ ఈద్గా ఫీడర్‌ పరిధిలోని బహదూర్‌పురా ఎక్స్‌ రోడ్డు, జూ పార్కు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. అలాగే నవాబ్‌సాబ్‌కుంట ఫీడర్‌ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు. గుడికా దవాఖానా ఫీడర్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. పూల్‌బాగ్‌ ఫీడర్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు. అలియాబాద్‌ ఫీడర్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

అవార్డు ప్రదానం



అవార్డును అందుకున్న డాక్టర్‌ చంటి ముదిరాజ్‌

నాంపల్లి: సమాచార హక్కు చట్టం సాధన కమిటీకి సోషల్‌ సర్వీస్‌ విభాగంలో బెస్ట్‌ ఎన్జీవో ఆఫ్‌ ది ఇయర్‌–2025 అవార్డు లభించింది. సోమవారం నందమూరి తారక రామారావు కళా మందిరంలో స్ఫూర్తి సర్వీసెస్‌ సొసైటీ ఇండియా ఎన్జీవో హానర్‌ ఆధ్వర్యంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ సభలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్‌ చంటి ముదిరాజ్‌ అవార్డును అందుకున్నారు. ఆకుల రమేష్‌, సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపినాథ్‌ కట్టికోల, మేడ్చెల్‌ కన్వీనర్‌ రామకృష్ణ, రంగారెడ్డి జిల్లా సంయుక్త కార్యదర్శి రాములు పాల్గొన్నారు.

రాజాసింగ్‌కు దమ్ముంటే స్పీకర్‌ ఫార్మాట్‌లో రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్‌ గౌడ్‌

అబిడ్స్‌: ఎమ్మెల్యే రాజాసింగ్‌కు దమ్ముంటే స్పీకర్‌ ఫార్మాట్‌లో రాజీనామా చేయాలని నియోజకవర్గ బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌ గౌడ్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం గౌలిగూడలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ..మీడియాలో ప్రచారం కోసమే రాజాసింగ్‌ నాటకాలు ఆడుతున్నారన్నారు. చౌకబారు రాజకీయాలకు పాల్పడుతున్న రాజాసింగ్‌కు 2014లో ఎన్నికల సమయంలో ఎన్ని ఆస్తులు ఉన్నాయో, ప్రస్తుతం ఎన్ని ఆస్తులు ఉన్నాయో ప్రజలకు వివరించాలని డిమాండ్‌ చేశారు. బీజేపీ అధిష్టానం రాజాసింగ్‌ రాజీనామాను ఆమోదిస్తే గోషామహల్‌లో రాజాసింగ్‌కు ఏ ఒక్కరు కూడా మద్దతు ఇవ్వరన్నారు.

ఐస్‌ స్కేటింగ్‌లో సత్తా చాటిన నయనశ్రీ



గన్‌ఫౌండ్రీ: ఉత్తరఖాండ్‌లో జరుగుతున్న 20వ జాతీయ షాట్‌ ట్రాక్‌ ఐస్‌ స్పీడ్‌ స్కేటింగ్‌ చాంపియన్‌షిప్‌ పోటీల్లో నగరానికి చెందిన టి.నయనశ్రీ సత్తాను చాటింది. 500 మీటర్స్‌, 1000, 1500 మీటర్ల విభాగాల్లో బంగారు పతకాలను గెలిచి అద్భుత ప్రతిభను కనబరిచింది. ఈ సందర్భంగా ఐస్‌ స్కేటింగ్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు అమితాబ్‌ శర్మా బంగారు పతకాలను అందజేశారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



ఫిర్యాదు స్వీకరిస్తున్న జోనల్‌ కమిషనర్‌

చార్మినార్‌: ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్‌ జోనల్‌ కమిషనర్‌ టీ.వెంకన్న ప్రజలకు సూచించారు. జోనల్‌ కమిషనర్‌ ఆధ్వర్యంలో చాంద్రాయణగుట్ట సర్కిపూల్‌బాగ్‌లోని జోనల్‌ కమిషనర్‌ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్‌, చార్మినార్‌, ఫలక్‌నుమా సర్కిల్‌కు చెందిన అక్రమ నిర్మాణం సమస్యపై 3, సంతోష్‌నగర్‌, చార్మినార్‌ సర్కిల్‌కి చెందిన ఇంజినీరింగ్‌ సమస్యలపై 2 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జోనల్‌ కమిషనర్‌ వెంకన్న మాట్లాడుతూ..ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్‌ జాయింట్‌ కమిషనర్‌ శంకర్‌ సింగ్‌, ఇంజినీరింగ్‌ ఎస్‌ఈ మహేశ్వర్‌రెడ్డి, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్‌ డాక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి, టౌన్‌ ప్లానింగ్‌ సిటీ ప్లానర్‌ మహమ్మద్‌ అబ్దుల్‌ మాజీద్‌, మలేరియా సీనియర్‌ ఎంటామాలజిస్ట్‌ నామాల శ్రీనివాస్‌, ఎలక్ట్రికల్‌ స్ట్రీట్‌ లైట్స్‌ ఈఈ రామారావు, వెటర్నరీ సీనియర్‌ అసిస్టెంట్‌ హమీద్‌ పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం



విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్న మేయర్‌ విజయలక్ష్మి తదితరులు

సుల్తాన్‌బజార్‌: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని మేయర్‌ గద్వాల విజయలక్ష్మి అన్నారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక స్పోర్ట్స్‌ మీట్‌ చాదర్‌ఘాట్‌లోని విక్టరి ప్లే గ్రౌండ్‌లో సోమవారంతో ముగిసింది. ఈ క్రీడా పోటీల్లో మీడియా ప్రతినిధులు, కార్పొరేటర్లు, జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్‌ మాట్లాడుతూ..క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆర్‌వి.కర్ణన్‌ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఇలాంటి క్రీడా పోటీలను కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారందరికీ మేయర్‌ విజయలక్ష్మీ, డిప్యూటీ మేయర్‌ శ్రీలతాశోభన్‌రెడ్డి మెమెంటోలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ సుభద్ర, కార్పొరేటర్లు, అధికారులు, కోచ్‌లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్‌లో జలమండలి జీఎం పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న జలమండలి జీఎం శ్రీనునాయక్‌

గోల్కొండ: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి వెంటనే వాటిని పరిష్కరిస్తున్నామని జలమండలి జనరల్‌ మేనేజర్‌ శ్రీనునాయక్‌ అన్నారు. సోమవారం ఆయన గుడిమల్కాపూర్‌లోని ఉప్పర్‌బస్తీ, తాళ్లగడ్డ, ఆర్యసమాజ్‌ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. నీటి సరఫరా అరకొరగా ఉందని నల్లాల్లో వచ్చే నీళ్లు కలుషితంగా ఉంటున్నాయని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. డ్రైనేజీ పైపులైన్‌లు, తాగునీటి పైపులైన్‌ల లీకేజీల కారణంగా నల్లాలో కలుషిత నీరు వచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. అయితే తమకు వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి కలుషిత నీటి సరఫరాకు అడ్డుకట్ట వేస్తున్నామన్నారు. కాగా కొత్త నీటి పైపులకు నిధులు మంజూరైందని దీనికి సంబంధించి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయన్నారు. త్వరలోనే పైపులైన్‌ల సమస్యలను పరిష్కరించి స్థానికులకు నల్లాల ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామన్నారు. బీజేపీ నాయకులు జొన్నకుంటి మధుసూదన్‌, లక్ష్మీకాంత్‌యాదవ్‌ తదితరులున్నారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



నాంపల్లి: రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నాంపల్లి జీఆర్పీ రైల్వే పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి(40) హైటెక్‌సిటీ–హఫీజ్‌పేట రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.